ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ..

కూసుమంచి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ విద్యార్థులు సత్తా చాటారు. కూసుమంచి, నాయకన్‌గూడెం ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎం.కీర్తన, జయపద్మిని 9.7 జీపీఏ సాధించి టాపర్లుగా నిలిచారు. ఇక కేజీబీవీలో 36 మందికిగాను 30 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా, కూసుమంచిలోని గ్లోబల్–రెయిన్‌బో పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థుల్లో 20 మంది ఉత్తీర్ణత సాధించారు.

నేలకొండపల్లి మండలంలో..

నేలకొండపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 448 మంది విద్యార్థుల్లో 316 మంది ఉత్తీర్ణులై 71 శాతాన్ని సాధించారు. నేలకొండపల్లి గురుకుల పాఠశాలకు చెందిన పి.ఇందుశ్రీ 9.2 జీపీఏ సాధించి టాపర్‌గా నిలిచింది. అలాగే గౌతమి పాఠశాలకు చెందిన బి.అనూష, ఎస్‌ఎఫ్‌ఎస్‌కు చెందిన కె.వినీషా 9.8 జీపీఏలతో టాపర్లుగా నిలిచారు. అంతేకాక పైనంపల్లి ఉన్నత పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలోని ఆచార్లగూడేనికి చెందిన దోమల ఉప్పలయ్య, నాగేంద్ర దంపతుల కుమార్తె అశ్రిత ఖమ్మంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతూ 10 జీపీఏ సాధించింది.



కుటుంబ సభ్యులతో డి.అశ్రిత

బాసితనగర్‌లో..

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం బాసిత్‌నగర్ హైస్కూల్‌కు చెందిన ఎస్.నవ్య 9.8 జీపీఏతో మండలంలో టాపర్‌గా నిలిచింది. ముచ్చెర్ల హైస్కూల్‌కు చెందిన డి.శృతి, ఎం.కీర్తిబిందు 9.7 జీపీఏ, మద్దులపల్లి హైస్కూల్‌కు చెందిన గుగులోతు లక్ష్మీప్రసన్న 9.7 జీపీఏ సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.

రూరల్ మండలంలో 88 శాతం ఉత్తీర్ణత..

ఖమ్మంరూరల్: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 604 మందికి గాను 517 మంది ఉత్తీర్ణులై 88శాతం, ప్రైవేట్ పాఠశాలల్లో మొత్తం 159 మందికి గాను 153 మంది ఉత్తీర్ణులై 96 శాతం సాధించినట్లు ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. అలాగే జెడ్పీహెచ్‌ఎస్ జలగంనగర్‌కు చెందిన ఎం.ఉషశ్రీ 9.8 జీపీఏ, తెల్దారుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన సాయిరాం 9.8 జీపీఏ సాధించారు.

తిరుమలాయపాలెంలో మండలంలో 83 శాతం..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలో పది విద్యార్థులు 83శాతం ఉత్తీర్ణత సాధించారు. మహ్మదాపురం గిరిజన గురుకుల పాఠశాలలో 96శాతం ఉత్తీర్ణత సాధించగా.. బానోత్ మోహన్ 10 జీపీఏ సాధించి టాపర్‌గా నిలిచాడు. దమ్మాయిగూడెం సరస్వతీ విద్యాలయంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా.. లోకానాథ్ 9.7జీపీఏ, జల్లెపల్లి ప్రభుత్వ పాఠశాలలో 96 శాతం ఉత్తీర్ణత సాధించగా.. యశ్వంత్ 9.8 జీపీఏ, బీరోలు పాఠశాలలో డేవిడ్ 9.3 జీపీఏ సాధించారు. కేజీబీవీ పాఠశాలలో 76 శాతం ఉత్తీర్ణత సాధించారు.



బానోత్ మోహన్

రఘునాథపాలెం మండలంలో 78 శాతం..

రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్: మండలంలోని తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాలలకు చెందిన మొత్తం 302 మంది విద్యార్థులకు గాను 235 మంది ఉత్తీర్ణులై 78 శాతం సాధించారు.

అర్బన్‌లో 74.80 శాతం..

ఖమ్మం అర్బన్ పరిధిలోని 20 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాలలకు సంబంధించి మొత్తం 1,000 మందికి 748 మంది ఉత్తీర్ణులై 74.80 శాతం సాధించారు. కాగా మోమినాన్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.రాజీవ్ 10 జీపీఏ సాధించాడు.

కస్తూర్బాలో..

రఘునాథపాలెంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో పది విద్యార్థులు 96శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. 9.5 జీపీఏతో స్ఫూర్తి టాపర్‌గా నిలిచింది. అలాగే కోయచలక పాఠశాలలో 95 శాతం ఉత్తీర్ణత సాధించగా.. వి.తేజస్విని 9.8 జీపీఏతో టాపర్‌గా నిలిచింది.

మైనారిటీ గురుకులంలో..

రఘునాథపాలెంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల ఖమ్మం బాలికల –1లో 73 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులై 97.33శాతం సాధించారు.

నేడు ఆంజనేయ విగ్రహావిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ గుట్టపైకి వెళ్లే ఘాట్‌రోడ్‌లో ప్రతిష్ఠించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని నేడు(గురువారం) ఆవిష్కరించనున్నారు.దేవస్థానం కార్య నిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు తల్లిదండ్రులు రాధాకృష్ణ, సత్యవతి /జ్ఞాపకార్థం రూ.లక్ష వ్యయంతో 4 అడుగుల గద్దెపై 6 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 10వ డివిజన్‌లోని చైతన్యనగర్ బైపాస్ రోడ్డులోని నిర్మించిన 30 అడుగుల శ్రీరామ భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా వేడుకలు గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. ఇందులో భాగంగా గురువారం శోభాయాత్ర, అంకురార్పణ, 12వ తేదీన మూర్తి కుంభస్థాపన, హనుమాన్ చాలీసా సామూహిక భజన, 13న హోమం, అభిషేకం, 14న ఉదయం 10.54 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుందని కార్పొరేటర్ చావా మాధురినారాయణరావు తెలిపారు.

ఖమ్మం మార్కెట్‌లో బస్తీ దవాఖానా



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్వేత

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలని కమిటీ ప్రతిపాదించింది. మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. కార్మికులు, కార్మికుల కుటుంబాలతోపాటు రైతులు, వ్యాపారులు, ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా మార్కెట్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదించారు. అలాగే, ఎండ తీవ్రత కారణంగా ఈనెల 15 నుంచి జూన్ 3వ తేదీ వరకు మార్కెట్‌కు సెలవులు ప్రకటిస్తూ తీర్మానించారు. అంతేకాక పాయింట్ ఆఫ్ సేల్(పీవోఎస్) మిషన్లకు నూతన బ్యాటరీలు, యార్డులు పరిశుభ్రతకు యంత్రాల కొనుగోలుకు తీర్మానించారు. ఆతర్వాత ఆదాయ, వ్యయాలను సమీక్షించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం, డైరెక్టర్లు గుండ్ల ముత్తయ్య, జాటోత్ సుందర్ సూర్య, యాసా పాపారావు, కుతుంబాక సురేష్, తాతా వెంకటేశ్వర్లు, పత్తిపాక రమేష్, దేవత అనిల్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.నాగరాజు, ఉద్యోగులు బి.బజార్, డి.నిర్మల, రాజేంద్రప్రసాద్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, అనారోగ్యంతో బాధపడుతున్న డైరెక్టర్ పోట్లపల్లి నాగరాజును మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేతతో పాటు డైరెక్టర్లు, అధికారులు పరామర్శించారు.

సీఎంకు పోస్టుకార్డుల ఉద్యమం

నేలకొండపల్లి: మార్కెట్ ఆదాయం కోసం రాత్రి, పగలు కష్టపడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్సలకు ఉద్యోగ భద్రత, వేతనాలు పెంచాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సీఎంకు పోస్టుకార్డుల ద్వారా ఉద్యమం చేపట్టినట్లు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మారగాని వీరబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం పోస్టు కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు జి.కాంతారావు, సాయికిరణ్, ఎం.వెంకటనారాయణ, ఆర్.సత్యనారాయణసింగ్, ఎం.శ్రీను, వీ.శ్రీను, కె.శ్రీరాములు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు..

ఒకరికి గాయాలు



దుకాణంలోకి దూసుకెళ్లిన బస్సు

ఖమ్మంక్రైం: నగరంలోని బస్ డిపో ప్రాంతంలో ఓ బస్సు అదుపు తప్పి మగ్గం దుకాణంలోకి దూసుకుపోవడంతో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా.. ఖమ్మం నుంచి కోదాడకు వెళ్లే పల్లె వెలుగు హెయిర్ బస్ విధులు ముగియడంతో డ్రైవర్.. కండక్టర్‌ను డిపోలో దింపాడానికి వచ్చాడు. ఈక్రమంలో డ్రైవర్‌కు కళ్లు తిరగడంతో ఒక్కసారిగా మగ్గం దుకాణంలోకి దూసుకు పోయింది. దీంతో అందులో ఉన్న అంజాద్ అనే వ్యక్తికి గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల వితరణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునర్నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మంకు చెందిన కాశబోయిన అనంతరాములు దంపతులు బుధవారం రూ.50వేల నగదును ఆలయ కమిటీకి అందజేయగా వారు కృతజ్ఞతలు తెలిపారు.



దాతకు రశీదు ఇస్తున్న కమిటీ బాధ్యులు

పొంగులేటి ఆర్థిక సాయం

ఖమ్మంమయూరిసెంటర్: రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామానికి చెందిన పోతురాజు రామ కోటయ్య కుమార్తెకు ఇటీవల వివాహం కాగా వివాహ ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థికసాయంతో పాటు పట్టు వస్త్రాలను పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, క్యాంప్ కార్యాలయంలో అందజేశారు.

రక్తదాన శిబిరం..

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌లో గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి దానం చేసిన 127 యూనిట్ల రక్తనిధిని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణమూర్తి, తహసీల్దార్ టి.సుమ, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, సీఈఓ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పాషా,ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యాన ధర్నా

ఖమ్మంఅర్బన్/తిరుమలాయపాలెం: ధాన్యం కొనుగోళ్లపై సర్కారు తీరును నిరసిస్తూ పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణమోహన్ ఆధ్వర్యాన నగరంలోని అల్లీపురం, వైఎస్సార్‌టీపీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం మండలం బీరోలు కొనుగోలు కేంద్రాల వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనాలని డిమాండ్ చేశారు. రైతు విభాగం అధ్యక్షుడు పత్తిపాటి అప్పారావుతో పాటు ఫాయాజ్ పాషా, గాజుల వరుణ్, కొత్త బాలాజీరావు, వాలూరి సత్యనారాయణ, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.